# రాజు-రాణి-ఆశ



లారెన్స్ ఎక్స్‌ప్రెస్ వే నించి ఎగ్జిట్ తీసుకుని, అక్కడి షాపింగ్ స్ట్రిప్ పార్కింగ్ లాట్‌లో కారు పార్క్ చేసి, "సరోవర్" ఇండియన్ రెస్టారెంటులోకి అడుగు పెట్టాడు రాజు.

రాజు ఓ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. మెనూకార్డు అక్కడ పెట్టి వెళ్లిపోయాడు మేనేజర్ మధు. రాజు తనకెంతో ఇష్టమైన ఇడ్లీ సాంబారు, మసాలా దోశ ఆర్డర్ చేశాడు.

కాలిఫోర్నియాలోని శాంటాక్లారా, శాన్‌హుసే, సన్నీ వేల్, పాలో ఆల్టో, మిల్పీటస్ లాటి ఊళ్ళన్నీ దాదాపు కలిసిపోయే ఉంటాయి. ఆ ప్రదేశానికి, "సిలికాన్ వేలీ" అనే పేరు కూడా ఉంది. ప్రపంచంలోని హైటెక్ కంపెనీలకు రాజధాని అది. ఎక్కడ చూసినా, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు.

డిన్నర్ సమయం అవటం వల్ల, సరోవర్ రెస్టారెంటు చాలా బిజీగా ఉంది.

అక్కడ కొంతమంది భారతీయులు, ఎక్కువగా అమెరికన్లు, చైనా, కొరియా, వియత్నాం వాళ్లు వున్నారు.

శాంటాక్లారాలోని ఒక హైటెక్ కంపెనీలో, సిస్టమ్స్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్నాడు రాజు. ఒక్కడే కూర్చున్నప్పుడు తన చుట్టూ జరుగుతున్న వివిధ విషయాలను పరిశీలనగా చూడటం అతనికి సరదాగా వుంటుంది.

వెయిటర్ వచ్చి, ఒక "అప్పడం" ఎపిటైజర్‌లాగా ఇచ్చి వెళ్లాడు. అప్పడం కొరుకుతూ, అప్పుడే చూశాడామెను రాజు.

రెండు టేబుల్స్‌కి అవతల కూర్చుని ఉన్నది. వెనక్కి తిరిగి కూర్చుని ఉండటం వల్ల ఆమె ముఖం సరిగ్గా కనపడటం లేదు. పంజాబీ డ్రెస్ వేసుకున్న ఆమె, వెనకనించీ మంచి అంగసౌష్టవంతో, రాజు దృష్టిని వెంటనే ఆకర్షించింది.

ఆమె పక్కనే, ఒక తెల్ల అమెరికన్ యువకుడు కూర్చుని ఉన్నాడు. ఆమెకు ఎదురుగా కూర్చున్న ఒక ఇండియన్ యువకుడి ముఖం మాత్రం స్పష్టంగా కనపడుతున్నది రాజుకి.

ముగ్గురూ, y2k ప్రోగ్రాంలో - వాళ్లు చేస్తున్న విషయాలను గురించి చర్చిస్తున్నారు.

ఆమె పక్కకు తిరిగి, అమెరికన్ కుర్రాడితో ఏదో మాట్లాడుతోంది.

అమెరికన్ అబ్బాయి కూడా నవ్వుతూ మాట్లాడుతున్నాడు. రాగి జుట్టు. చాలా పొడుగ్గా వున్నాడు. అతనికి ఎదురుగా కూర్చున్న ఇండియన్ కుర్రాడు చాలా ఉత్సాహంగా మాట్లాడు తున్నాడు. అతని ఇంగ్లీషు అంతా అమెరికన్ ఏక్సెంట్‌లో వుంది.

తింటున్న అప్పడం కడుపులోకి వెళ్లగానే, రాజులోని ఎనలిస్ట్ బయటకు వచ్చాడు.

రాజు తన ఎనాలిసిస్ సౌకర్యార్థం - అమెరికన్ అబ్బాయి, ఇండియన్ కుర్రాడు అని ఆ ఇద్దరు మగవాళ్లకి, రాణి అని ఆ అమ్మాయికి పేర్లు పెట్టుకున్నాడు.

ఇక తన పరిశీలనాత్మకమైన వివరణతో, వాళ్ల కథ ఊహించడం మొదలుపెట్టాడు రాజు.

రాణి ఇంగ్లీష్ అచ్చం ఇండియన్ ఇంగ్లీష్‌లాగా వుంది కనుక, ఆ అమ్మాయి ఈ మధ్యనే ఇండియా నించి వచ్చి వుండాలి. ఆ ఇండియన్ కుర్రాడు, అమెరికాలో ఇండియన్ తల్లిదండ్రులకు పుట్టిన పిల్లాడై వుండాలి. అతని మాట, మాట తీరు, భుజాలు ఎగరేయటం, చేతులు తిప్పటం - అతను పుట్టినప్పటినించీ అమెరికాలోనే వున్నట్టు తెలుస్తున్నది.

ఆ అమెరికన్ అబ్బాయి, సాంబారు - బీరులాగా తాగేస్తున్నాడు కనుక, అతను హైటెక్‌లో పనిచేస్తున్నాడనీ, మిగతా దేశాల వాళ్లతో - ముఖ్యంగా భారతీయులతో, బాగా పరిచయం ఉన్నవాడనీ తెలుస్తున్నది.

ఈలోగా వెయిటర్ వచ్చి ఇడ్లీ, రెండు చట్నీలు, సాంబారు రాజు టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

రాజు తింటూ, తన పరిశీలన కొనసాగించాడు.

ఆ అమ్మాయికి తను రాణి అని పేరు పెట్టాడెందుకు?.... ఎందుకంటే ఆ అమ్మాయి

అందంగా ఉన్నది కనుక. తన పేరు రాజు కనుక.

తర్వాత రాజు పరిశీలన రాణి మెడ మీదకు వెళ్లింది. సన్నగా, నున్నగా, తెల్లగా వున్న మెడ. ఆ మెడలో, ఆమె శరీరానికి సరిగ్గా హత్తుకుని, తళతళా మెరుస్తున్న పలుచటి బంగారు గొలుసు.

అమెరికన్ అబ్బాయి పెద్దగా నవ్వి రాణి భుజం మీద మెల్లగా కొట్టాడు. ఇండియన్ కుర్రాడు అమెరికన్ ఇంగ్లీషులో వేసిన పోలిష్ జోకుకి.

రాణి కూడా నవ్వుతున్నది.

"యు ఆర్ సో స్వీట్, వెన్ యు స్మైల్!" అంటున్నాడు రాణితో, ఇండియన్ కుర్రాడు.

రాణి చిన్నగా మందహాసం చేసింది.

"నువ్వు వచ్చాక మన ప్రాజెక్ట్ చకచకా నడుస్తున్నది. నువ్వు చాలా తెలివైనదానివి జాకీ!" అన్నాడు అమెరికన్ అబ్బాయి.

అయితే రాణి పేరు జాకీ అన్నమాట.

రాజు-రాణి-జాకీ.... బాగా కుదిరాయి పేర్లు - మనసులో అనుకున్నాడు రాజు.

రాణి చిన్నగా నవ్వింది. "నా పేరు జాకీ కాదు. జానకి. ఎన్నిసార్లు చెప్పాలి నీకు"

"ఐ యామ్ సారీ... లెట్ మీ ట్రయి ఎగైన్.... జా......న......కి......"

రాణి హుందాగా తల పైకెగరేసి, అందంగా నవ్వి, "దట్స్ రైట్.... ఇకనించీ బాగా గుర్తుపెట్టుకో" అన్నది. అంటూనే, అతని తల వెనుక సుతారాంగా ఒక చిన్న దెబ్బ వేసింది.

ఇండియన్ కుర్రాడు-

"ఈసారీ నిన్ను జాకీ అని పిలిస్తే... బాగా గట్టిగా కొట్టు" అన్నాడు పెద్దగా నవ్వుతూ.

"ఏయ్.... సునీల్.... అటువంటి చచ్చు సలహాలు ఇవ్వకు" అని అన్నాడు అమెరికన్ అబ్బాయి తను కూడా చిన్నగా నవ్వుతూ.

అంటే ఈ ఇండియన్ విలన్ పేరు సునీలన్న మాట. ఆ నీలుగుడు చూస్తూనే తెలుస్తున్నది. వాడి పేరు సునీలని. ఇక ఈ అమెరికన్ వెధవ పేరేమిటో... అనుకున్నాడు రాజు.

ఇంతలో విచిత్రమైన సంఘటన జరిగింది.

సునీల్ తన జేబులోంచి ఒక చిన్న పాకెట్ తీశాడు. దాంట్లోనించి ఒక డైమండ్ ఉంగరం తీశాడు. లేచి, అక్కడే మోకాళ్ళ మీద కూర్చుని, "జానకీ.... నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాడు చిరునవ్వుతో.

ఆ సంఘటనకి రాజు చేతిలోని స్పూన్ జారి, సాంబార్ కప్పులో పడింది.

జానకి ఒక్క క్షణం నిర్ఘాంతపోయింది. వెంటనే తేరుకుని నెమ్మదిగా అన్నది.

"హఠాత్తుగా అడిగేశావ్. అసలు నా గురించి నీకేం తెలుసని....."

"మూడు నెలలనించీ నిన్ను చూస్తున్నాను. నీతో మాట్లాడుతున్నాను. నీ ప్రవర్తన, అభిరుచులూ, అభిప్రాయాలు - అన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తూనే ఉన్నాను. నాతో మాట్లాడేటప్పుడు, నీ కళ్ళల్లోని మెరుపునీ ఇష్టాన్నీ గమనిస్తూనే ఉన్నాను. నిన్ను పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి కూడా వచ్చాను. నీకు కూడా ఇష్టమయితే చెప్పు. మనిద్దరం పెళ్లి చేసుకుందాం. నీకు ఇష్టం లేకపోతే... మనం మంచి స్నేహితులంగా మిగిలిపోదాం...." అన్నాడు సునీల్, జానకి కళ్లల్లోకి ఆరాధనగా చూస్తూ.

జానకి మాట్లాడలేదు.

అమెరికన్ అబ్బాయి అన్నాడు-

"మేబి.... నేను ఇక్కడ ఉండటం సభ్యత కాదేమో" అని కుర్చీలోనించి నెమ్మదిగా లేచాడు.

జానకి అతని చేయి పట్టుకుని ఆపింది.

"కెన్... డోంట్‌గో... నాకు ఈ దేశంలో మీరిద్దరే మంచి స్నేహితులు. చుట్టాలు. నాకు మీరు చాలా సహాయంగా వున్నారు. కనుక ఇక్కడ ఉంటేనే నాకు బాగుంటుంది...." అన్నది జానకి.

"అవును. నువ్వు ఉండు కెన్. నేను జానకి వేలుకి ఉంగరం పెట్టేటప్పుడు చప్పట్లు కొడుదువుకాని" అన్నాడు సునీల్ నవ్వుతూ.

కెన్ ఒకసారి భుజాలు ఎగరేసి, చిరునవ్వు నవ్వి తన సీట్లో కూర్చున్నాడు.

"నాకు కులం, మతం, భాషా బేధాలు లేవు. నువ్వంటే చాలా ఇష్టం. నువ్వూ ఇష్టపడితే ఫ్లోరిడా లోని మా నాన్నకి ఫోన్ చేసి చెబుతాను. మన పెళ్లి ఇక్కడ కావాలంటే ఇక్కడ, ఇండియాలో కావాలంటే ఇండియాలో చేసుకుందాం" అన్నాడు సునీల్.

"మా గురించి, మా కుటుంబం గురించి నీకేం తెలుసని...." అన్నది జానకి.

"అఖ్కర్లేదు. నిన్ను చూస్తుంటే, నీ సంస్కారం చూస్తుంటే నేను ఆ మాత్రం ఊహించగలను. ఒకవేళ నా ఊహ తప్పయినా, నేను కాపురం చేసేది నీతోకాని మీ కుటుంబంతో కాదుకదా...."

సునీల్ ఒక్క క్షణం ఆగి మళ్లీ అన్నాడు.

"నా గురించి, మా కుటుంబం గురించి, నీకు ఇంకా ఏమయినా వివరాలు తెలుసు

కోవాలంటే చెప్పు.... తొందర ఏమీలేదు. నువ్వు మనసారా అంగీకరించటం ముఖ్యం నాకు...."

ఒక్క క్షణం ఆలోచించి జానకి అన్నది.

"మా వాళ్లు కట్నాలు ఏమీ ఇచ్చుకోలేరు"

సునీల్ పెద్దగా నవ్వాడు.

అంతలోనే నవ్వటం ఆపి, సీరియస్‌గా అన్నాడు.

"నన్నెంత చౌకగా అంచనా వేశావు జానకీ. నేను అలా అమ్ముడుపోవటానికి పశువుని కాను. ఒక మనిషిని. సంస్కారమున్న మనిషిని" అన్నాడు.

అతన్ని వింతగా చూసింది జానకి.

"నీకు మన దేశంలో వున్న ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే కనీసం పది లక్షల రూపాయలు పలుకుతుంది కట్నం. అది తెలుసా నీకు"

సునీల్ అన్నాడు. "నేను పుట్టింది అమెరికాలో. పెరిగింది అమెరికాలో. ఈ కట్నాల సంగతులు, మా అమ్మా నాన్నల ద్వారా విని, ఆ అమానుష వ్యవస్థని అసహ్యించుకున్నాను. ప్రపంచంలోని అన్ని సంస్కృతుల్లోనూ, స్త్రీని ఎక్కువగా గౌరవించేది మా భారతదేశ సంస్కృతి అని గర్వంగా చెప్పుకోవటమే కానీ, అదే స్త్రీకి వెల కట్టి అగౌరవించటం, కట్నం ఇవ్వలేదని అమానుషంగా హింసించటం చూస్తుంటే, హిపోక్రసీ పరాకాష్ఠనందుకున్నదని అనిపిస్తున్నది. మళ్లీ ఆ మాట ఎప్పుడూ ఎత్తకు నా దగ్గర".

అతని ముఖం ఎర్రబడటం చూసిన జానకి, ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు.

"ఎదుటి మనిషిని గౌరవించటం, మా అమ్మా నాన్న నాకు చిన్నప్పట్నించీ బాగా నేర్పారు. అసలు మానవత్వం మీదా, ఆ విలువల మీదా నాకు నమ్మకం వాళ్ల ద్వారానే కలిగింది. నిన్ను నా గుండెల్లో పదిలంగా దాచుకుంటాను. నాకా అవకాశం ఇస్తావా జానకీ...." అడిగాడు సునీల్.

జానకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

వాటిని కొనగోటితో తుడుచుకుని, "అలాగే... సునీల్. నిన్ను పెళ్లిచేసుకోటానికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. కాకపోతే ఈ రోజే ఇండియాలోని మా నాన్నకి ఫోన్ చేస్తాను. వాళ్లు కూడా ఒప్పుకుంటే బాగుంటుంది కదా...." అన్నది.

సునీల్ కళ్లల్లో ఒక్కసారిగా వేయి దీపాల కాంతి వెలిగింది. "థాంక్స్. థాంక్స్ ఎ లాట్. మా నాన్నకి కూడా ఈ రోజే చెబుతాను" అని లేచి నుంచుని, ఆమె చేతిని అందుకున్నాడు. ఆమె చేతిని మృదువుగా ముద్దు పెట్టుకుని, ఆమె వేలికి ఉంగరం తొడిగాడు.

కెన్ లేచి నుంచుని చప్పట్లు కొట్టాడు.

రెండు నిమిషాలు అయ్యాక వాళ్లు ముగ్గురూ అక్కడ్నించి లేచారు.

అప్పుడే ఆమె ముఖాన్ని స్పష్టంగా చూశాడు రాజు. ఆమెను ఎక్కడో చూసినట్టుంది.

ఎక్కడా.... ఎక్కడా....

అవును గుర్తొచ్చింది. ఆరు నెలల క్రితం, ఇండియా వెళ్లినప్పుడు, తన పెళ్లి చూపుల తతంగంలో ఈ అమ్మాయిని కూడా చూశాడు. అన్నీ నచ్చాయి కానీ, కట్నం దగ్గర వ్యవహారం బెడిసి కొట్టింది.

తన కొడుకు అమెరికాలో ఉన్నాడనీ, పది లక్షలు కట్నం కావాలనీ అన్నాడు తన తండ్రి. ఆ అమ్మాయికి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం వచ్చిందనీ, వీసా కూడా రాబోతున్నదనీ, త్వరలో వెడుతుందనీ చెప్పారు. జానకి తండ్రి, ఇల్లు అమ్మి కట్నం ఇవ్వటానికి సిద్ధపడినా, జానకి మాత్రం అంగీకరించలేదు. తనకు ఆ అమ్మాయి అందం, చదువూ, సంస్కారం నచ్చినా, ఏమీ మాట్లాడలేదు.

తన తండ్రికి ఈ పెళ్లి వ్యాపారంలో పది లక్షలు నష్టం రావటం తనకిష్టం లేకపోవటం వల్ల కాబోలు. లేదా తన మనసులో కూడా, అప్పనంగా వచ్చే ఆ కట్నం డబ్బుల మీద ఆశ ఉండటం కూడా కారణం కావచ్చు. దానితో ఆ పెళ్లి సంబంధమే కాదు, మొత్తం నాలుగు మంచి సంబంధాలు తప్పి పోయాయి.

కానీ జానకి తనకి అంతగా గుర్తుండటానికి వేరే కారణం కూడా ఉంది.

పెళ్లి చూపులు అయ్యాక బయటికి వెడుతుండగా, జానకి తనకో కాగితం ఇచ్చింది. అది ఒక పత్రికలో పడిన 'మగమహారాజు' అనే కవిత.

గానుగ ఎద్దు తనని కొనుక్కున్న యజమానికి సేవలు చేసి, అతనికి ధనం సంపాదించి పెడుతున్నది. మరి మగవాడు కట్నం పేరుతో తనని కొనుక్కున్న స్త్రీకి సేవలు చేయకపోగా, ఆమె చేత ఇంటా బయటా ఎందుకు పని చేయిస్తున్నాడు అని ప్రశ్న వేసిన రచయిత, ఆ ఎద్దుకు మనిషికున్న ఆ సంస్కారం లేకపోవటం వల్ల కాబోలు అని సమాధానపడతాడు.

ఆ కవిత చదివి అదిరిపడ్డాడు తను.

ఈలోగా సునీల్, జానకి, కెన్ తనని దాటుకుని ముందుకు వెడుతున్నారు. ముందుగా వెళ్లిన సునీల్ తలుపు తీసి పట్టుకున్నాడు. కెన్ జానకికి దారి ఇచ్చి "ఆఫ్టర్ యు" అంటున్నాడు.

రాజు మాత్రం తన ముఖం ఆమెకు కనపడకుండా, తల వంచుకు కూర్చున్నాడు. ●

*(స్వాతి సపరివార పత్రిక : జనవరి 29, 1999)*